నెరవేరిన కల


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వంతెన

- అన్నారెడ్డిపల్లి వంతెన నిర్మాణంపై హర్షం
- గ్రామాలకు తీరనున్న సమస్య
- నిర్మాణం పూర్తి.. ప్రారంభానికి సిద్ధం

మహమ్మదాబాద్: ఎట్టకేలకు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సమస్య తీరనుంది. అన్నారెడ్డిపల్లి వంతెన నిర్మాణంతో అనేక గ్రామాలకు రాకపోకల విషయంలో అవస్థలు తొలగనున్నాయి. ఇప్పటికే నిర్మాణం పూర్తయింది.. కాగా ప్రారంభించడమే మిగిలింది.. దీంతో తమ కల నెరవేరిందని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా.. మహమ్మదాబాద్ మండలం నుంచి హన్వాడ మండలంలో పలు గ్రామాలకు వచ్చిపోయేందుకు రోడ్డు మార్గం ఏర్పాటు చేశారు. కానీ అన్నారెడ్డిపల్లి సమీపంలో ఓ పెద్ద వాగు ఉండటంతో వర్షాకాలంలో రాకపోకలకు ఎంతో అంతరాయం కలిగేది. వాగు వచ్చిందంటే చాలు రాకపోకలు బందయ్యేవి. రోజుల తరబడి తండాల వారు దిగ్బంధంలో ఉండేవారు. అత్యవసర సమయంలో వాగుదాటుతూ ఎంతో మంది ప్రమాదానికి గురైన ఘటనలు ఉన్నాయి. ఎంతో మంది ప్రయాణం చేయలేక కార్యాలయాలకు, ఆస్పత్రులకు సైతం వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ క్రమంలోనే ఏడాదిన్నర క్రితం ప్రభుత్వం రూ. 1.41 కోట్లు నిధులను బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు కేటాయించి పనులు ప్రారంభింపజేసింది. ప్రస్తుతం పనులు పూర్తయ్యాయి. ఇక బ్రిడ్జిని ప్రారంభించడమే మిగిలింది. దీంతో తండాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


వంతెన నిర్మాణానికి ముందు వాగు దాటేందుకు అవస్థలు పడుతున్న గిరిజనులు(ఫైల్)

❐ మహమ్మదాబాద్ మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ చించోళి హైవేకు లింకు రోడ్డుగా ఉన్న అన్నారెడ్డిపల్లి రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. అంతేకాకుండా ఈ ప్రాంతంలో అనే గ్రామాల వాసులు మహబూబ్‌నగర్ వెళ్లాలన్నా నియోజకవర్గమైన పరిగి, కోస్గి, కోడంగల్, తాండూరు తదితర ప్రాంతాలకు వెళ్లాలన్నా ఈరోడ్డు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. అదేవిధంగా అన్నారెడ్డిపల్లి మీదుగా హన్వాడ మండలం మునిమోక్షం, తదితర గ్రామాలకు ఇదే దగ్గరి మార్గం. బ్రిడ్జి నిర్మాణం కాక ముందు ఎంతో మంది అవస్థలు పడాల్సి వచ్చేది. కాగా ప్రస్తుతం సమస్య తీరనుంది. అదేవిధంగా నాలుగైదు ఏళ్లగా బీటీ రోడ్డుకోసం కంకర వేసి వదిలేశారని.. అదికూడా పూర్తిచేస్తే ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నో కష్టాలు పడ్డాం



వర్షం వచ్చి వాగు పారిందంటే చాలు దాన్ని దాటేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. నిత్యం బయటికి వెళ్లాలంటే గతంలో ఎడ్లుల బండితో, ట్రాక్టర్ల సాయంతో వాగు దాటించే వాళ్లం. ఒక్కోసారి వారం రోజుల పాటు బయటికి వెళ్లడానికి కూడా వచ్చేది కాదు. సంవత్సరాల తరబడి వాగుతో ఎన్నో కష్టాలు పడ్డాం. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణంతో మా తండాతో పాటు ఎన్నో గ్రామాల ప్రయాణికుల సమస్య తీరనుంది.

– మోహన్‌నాయక్, అన్నారెడ్డిపల్లి

ప్రమాదాలు జరిగాయి



వర్షాకాలంలో వాగు వచ్చిందంటే దాన్ని దాటే క్రమంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. అదేవిధంగా అటు నుంచి ఎవరూ వెళ్లకుండా పోలీసులు, రెవెన్యూ అధికారులు కాపలా కాయాల్సివచ్చేది. గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు ఇచ్చారు. సమస్యను తీర్చినందుకు ఎంతో రుణపడి ఉన్నాం.

– సూర్యానాయక్, అన్నారెడ్డిపల్లి

త్వరలో ప్రారంభం..

అన్నారెడ్డిపల్లితో బాటు ఎన్నో గ్రామాల సమస్య తీర్చేందుకు రూ. 1.41 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టి పూర్తి చేశాం. త్వరలో ప్రారంభం చేసేందుకు ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం పనులన్నీ పూర్తయ్యాయి. బ్రిడ్జి ప్రారంభం చేయడం మాత్రమే మిగిలింది.

– ఎండీ మతిన్, పంచాయత్‌రాజ్ ఏఈ

వైభవంగా వార్షికోత్సవ పూజలు

- 108 కలశాలతో ఊరేగింపు...

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో 8 వ వార్షికోత్సవ పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. 108 కలశాలతో పలువురు మహిళలు ఊరేగింపుగా దేవాలయం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి వట్టి వేర్లను చుట్టి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు, పిల్లలు, పెద్దలు కలశ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అలంకారం అనంతరం ఘనంగా పూజలు చేశారు. అదేవిధంగా ఆలయంలో పరమేశ్వరుడికి పంచామృతంతో అభిషేకం చేశారు. పూజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగాయి. లలితా సహస్ర నామార్చన, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు చేపట్టారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

జడ్చర్ల: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని వేదమిత్ర విద్వాంసులు శ్రీ బ్రహ్మానంద పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్య సమాజ మందిరంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న యజుర్వేద గాయత్రి మహా యజ్ఞం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. పూర్ణాహుతి శాంతి పఠనంతో కార్యక్రమాన్ని ముగించారు. ఆర్య ప్రతినిధి సభ అధ్యక్షుడు నర్సిములు, ఉపాధ్యక్షులు శివకుమార్, రాజేశ్వర్, విజయ్‌కుమార్, కృష్ణయ్య పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న భక్తులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల: ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలని మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పాలకులు, అధికారులు తమ పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆదివారం స్థానిక నేతాజీ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో.. ప్లకార్డులను చేతబూని నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపై వారం రోజులుగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోక పోవడం దారుణంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, ఉపాధ్యక్షుడు మహేశ్, యాదమ్మ, అంజమ్మ, కేశవులు, శంకర్, అలివేలు, అరుణ పాల్గొన్నారు.


బాదేపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

క్లుప్తంగా

విద్యార్థులకు చదరంగం పోటీలు



జడ్చర్ల: స్థానికంగా ఆదివారం అవోపా ఆధ్వర్యంలో విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. విద్యార్థులలో మేధాశక్తిని పెంపొందించేందుకు చదరంగం ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. సీనియర్, జూనియర్ విభాగాలకు సంబంధించి దాదాపు 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు మురళీకృష్ణ, శ్రీనివాస్, శివకుమార్, నటరాజ్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మసానిపల్లిలో హెల్త్ క్యాంపు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని తిమ్మసానిపల్లిలో ఆదివారం భవిత మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్లు రేఖ, సందీప్‌కుమార్, ప్రవళిక, శ్రీకరి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తామని నిర్వహకులు శశిబాబు, శ్యాం సుందర్ లు తెలిపారు.

ఆలయానికి విరాళం



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణానికి.. మహబూబ్‌నగర్‌కు చెందిన శాంతి ప్రింటర్స్ నిర్వాహకుడు బసప్ప ఆదివారం రూ.21వేల నగదును విరాళంగా అందజేశారు. అదేవిధంగా జానంపేటకి చెందిన మల్లెల శశిధర్‌గౌడ్ 100 బస్తాలు, మూసాపేటకు చెందిన చాకలి కందూర్ కృష్ణ 40 బస్తాల సిమెంట్‌ను అందజేశారు. అభివృద్ధికి దాతలు సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్ సాగర్ కోరారు.

సీసీ కెమెరాలు అమర్చుకోవాలి

జడ్చర్ల: నేరాల నియంత్రణకు ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని స్థానిక సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానికపద్మావతి కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని కాలనీ వాసులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వలన కాలనీలలో దొంగతనాలు, తదితర నేరాలు నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా సైబర్ క్రైమ్స్ పై అవగాహణను పెంచుకోవాలని, అపరిచితులు చేసే ఫోన్ కాల్స్‌ను స్వీకరించవద్దన్నారు. ఓటీపీలు, తదితర లింక్‌లు ఓపెన్ చేయవద్దన్నారు. పట్టణంలో ప్రతి కాలనీలో ఏర్పాటు చేయనున్న గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తమను ఆహ్వానిస్తే ప్రజలను చైతన్యవంతం చేసే విధంగా అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి కమిటీ నిర్వాహకులు తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇరువర్గాలకు నచ్చజెప్పిన సీఐ

మహబూబ్‌నగర్ క్రైం: భూమి వ్యవహారంలో రెండు వర్గాలు గొడవపడుతుంటే టూటౌన్ సీఐ ఘటనా స్థలానికి చేరుకొని సర్దిచెప్పారు. సీఐ ఏజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని కొత్త చెరువు కట్టపై ఉన్న కట్టా మైసమ్మ ఆలయం దగ్గర అన్నదానం చేయడం కోసం ఆలయ భక్తులు కొందరు కొంత స్థలం చదును చేస్తున్న క్రమంలో విషయం తెలుసుకున్న మరో వర్గం నాయకులు అక్కడికి చేరుకుని అభ్యంతరం తెలిపారు. దీంతో రెండు వర్గాల మధ్యలో వాగ్వాదం జరుగుతుందని తెలుసుకుని పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. ప్రస్తుతం జరిగిన కార్యక్రమం తర్వాత సదరు భూమి మరో వర్గానికి చెంది ఉంటే వదిలిపెట్టాలని సూచించినట్లు సీఐ వెల్లడించారు.

వీరభద్రస్వామి ఆలయానికి పాదయాత్ర

మరికల్: మండల కేంద్రానికి చెందిన యువకులు శ్రావణమాసం సందర్భంగా ఆదివారం కోయిల్‌కొండ మండలంలోని వీరభద్రస్వామి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. లోక కల్యాణం కోసం ప్రతి ఏడాది శ్రావణమాసంలో వీరభద్రస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని పాదయాత్ర సభ్యులు మహేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గౌరిశంకర్, శేఖర్, రఘు, రాము, రమేష్ వీరశేఖర్ పాల్గొన్నారు.



ఉత్సాహంగా బెల్టు గ్రేడింగ్ పరీక్షలు


బెల్టులు పొందిన విద్యార్థులతో కృష్ణయ్య, ఇతర మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే, మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే డూ ఇండియా ఫౌండర్ చీఫ్ జి.కృష్ణయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల ఆవరణలో ఆదివారం జీకే షోటోకాన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడారు. స్వీయరక్షణ కోసం కరాటే, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. మాస్టర్ శివకుమార్ మాట్లాడుతూ బెల్టు గ్రేడింగ్ పరీక్షలో దీక్షిత, సాకేత్, వినోద్, హర్షిత ప్రియ, సాయి సుశాంత్‌లు డబుల్ ప్రమోషన్ పొందగా ఇతర విద్యార్థులు వివిధ బెల్టులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్లు దామోదర్, పవన్‌కుమార్, కళ్యాణ్, రిశ్విత్, పర్శ పాల్గొన్నారు.

కరాటేలో కింగ్‌షోటోకాన్ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఆయా విభాగాల్లో సోఫియాన్ అలీ, సాబీర్‌పాష, మారియ బేగం బంగారు పతకాలు, అమాన్‌అలీ, ఉమేరాబేగం వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను జహంగీర్‌పాష ఖాద్రీ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్లు సురేంద్ర కృష్ణ, రాకేష్‌కుమార్, మాస్టర్ కేశవ్‌గౌడ్, సత్య, శంకర్, అమర్‌సింగ్, అస్లం సిద్దిఖీ, కన్నన్‌గౌడ్, గోపన్న తదితరులు పాల్గొన్నారు.


పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

విజయ్‌కుమార్‌కు డాక్టరేట్



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన ప్రముఖ ద్విభాషా (తెలుగు, హిందీ) కవి ఎంఎస్.విజయ్ కుమార్‌కు న్యూఢిల్లీ ఫరీదాబాద్ మ్యాజిక్, ఆర్ట్ యూనివర్సిటీ వారు డాక్టరేట్‌తో సత్కరించారు. శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో విజయ్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సీపీ యాదవ్, అంతర్జాతీయ ప్రఖ్యాత మేజిషియన్ డాక్టర్ రాజ్‌కుమార్, మేవార్ యూనివర్సిటీ డైరెక్టర్ ఎస్‌కే.రోహిల్లా, ప్రముఖ మేజీషియన్ పీఎస్ జెన్ తదితరులు హాజరయ్యారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ హిందీ భాషాభివృద్ధికి, హిందీ సాహిత్య రంగానికి చేసిన కృషికి డాక్టరేట్‌తో సత్కరించడం సంతోషంగా ఉందన్నారు.

వెండి విగ్రహం వితరణ

మద్దూరు: మండలంలోని రెనివట్ల ఆంజనేయ స్వామి ఆలయానికి గ్రామానికి చెందిన గడ్డమీది తిప్పన్న కుటుంబ సభ్యులు 3.5 కేజీల వెండి ఆంజనేయస్వామి విగ్రహానికి వితరణ అందజేశారు. శ్రావణమాస మొదటి శనివారాన్ని పురస్కరించుకొని స్వామివారి ఆలయంపై విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శనివారం రాత్రి జరిగిన రథోత్సవం సందర్భంగా వెండి విగ్రహాన్ని రథంలో ఉంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కన్కప్ప, నారాయణ, గోవిందు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ


జెండాల పంపిణీలో పాల్గొన్న నాయకులు

హన్వాడ: మండల పరిధిలోని పెద్దదర్పల్లిలో ఆదివారం బీజేపీ నాయకులు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా పార్టీ నాయకుడు రాములు గౌడ్ మాట్లాడారు. భారతీయ సాంప్రదాయాలను నిలబెట్టుకునేలా స్వాతంత్ర్య ఉత్సవాలు ప్రతీ ఒక్కరికీ తెలిసేలా యువత బీజేపీ నాయకులు పని చేయాలని తెలిపారు. ప్రతీ ఇంటిపై జాతీయ జెండా రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. వినీత్‌గౌడ్, గోపాల్, చెన్నయ్యగౌడ్, రవి, రఘునందన్, వెంకట్రాములు, వెంటకయ్య, రాజు పాల్గొన్నారు.

నేడు ద్విచక్రవాహన ర్యాలీ

పాలమూరు: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ఈ ర్యాలీ ఉంటుందన్నారు. ఎంపీ డీకే అరుణ పాల్గొంటారని వివరించారు.

అ'పూర్వ' సమ్మేళనం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ హైస్కూల్‌లో పదోతరగతి చదివిన 1994వ బ్యాచ్‌కు చెందిన సుమారు 35 మంది విద్యార్థులు ఆదివారం ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఏకంగా 30 ఏళ్ల తర్వాత తాము చదివిన పాఠశాలకు కుటుంబ సమేతంగా వచ్చి ఒకరినొకరు ఆత్మీయంగా, ఆప్యాయంగా పలకరించుకున్నారు. అందరూ ఎంతో ఉల్లాసంగా కొన్ని గంటల పాటు అక్కడే గడిపారు. అలాగే అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను ఘనంగా సన్మానించారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలపై రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకుని వెళ్లినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరహరి తెలిపారు. వరంగల్‌లో రెండు రోజులపాటు కొనసాగుతున్న రాష్ట్ర మహాసభల్లో భాగంగా ఆదివారం ఆయన పాల్గొని జిల్లాలో చేపట్టే భవిష్యత్ కార్యాచరణ రిపోర్టును రాష్ట్ర నాయకులకు అందించినట్లు పేర్కొన్నారు. మద్దూర్, ఊట్కూర్ గురుకుల స్కూల్‌లకు సొంత భవనాలు, భోజన నాణ్యతలో విఫలం, బీసీ సంక్షేమ హాస్టల్‌లలో సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: టీజాక్ గౌరవాధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు మరికంటి బాలరాజు, విజయభూషణ్, రాజశేఖర్ రెడ్డి, కిరణ్‌కుమార్, కుర్మయ్య, శ్రీనివాసులు, సురేష్, మౌలానా, శ్రీనివాస్ తదితరులు పీఆర్‌టీయూ (తెలంగాణ) సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా మరికంటి బాలరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు తదితర సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే సర్వీస్ రూల్స్ రూపకల్పన, ఉపాధ్యాయ, ఉద్యోగులకు మెరుగైన ఆరోగ్య పథకం, పీఎస్‌హెచ్‌ఎం పోస్టుల మంజూరు, ఎస్‌జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పిస్తారని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భూపతిసింగ్, గోనెల శ్రీధర్, ఉపాధ్యక్షుడు కెంచె రాఘవేందర్, జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, కార్యదర్శులు నవాబుపేట శ్రీనివాస్, ఖదీర్‌పాషా, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు

మిడ్జిల్: మండలకేంద్రంలో అధిక ధరలకు యురియా విక్రయిస్తున్నారన్న విషయంపై సోషల్ మీడియాలో కొందరు పోస్టులు పెడుతున్నారు. విషయం ఆదివారం హల్‌చల్ చేసింది. మండల వ్యవసాయ అధికారి సిద్ధార్థను విషయమై వివరణ కోరగా... ఎవరైనా అధికధరలకు యురియా అమ్మినట్లు తెలిస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. .

మున్సిఫ్ కోర్టు ఏర్పాటయ్యేనా..?

- రెండేళ్లు గడుస్తున్నా వీడని సందిగ్ధం

దేవరకద్ర రూరల్: నియోజకవర్గంగా ఏర్పడి దాదాపు 17 ఏళ్లు కావస్తున్నా దేవరకద్రలో స్థానికంగా ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో స్థానికంగా అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలకు అనుమతి వచ్చినా వివిధ కారణాల వల్ల ఏర్పాటు కాలేదు. అదేవిధంగా నియోజకవర్గ కేంద్రంలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు పరిస్థితి కూడా అలానే ఉంది. రెండేళ్ల క్రితం ప్రభుత్వం నుంచి ఏర్పాటుకు ఆదేశాలు వచ్చాయి. అందుకు సంబంధించి భవన పరిశీలనా జరిగింది. అయినా ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాలేదు. దీంతో ఏర్పాటుకు ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఆదిలోనే నిలిచిన అడుగులు...

కొత్తగా మున్సిఫ్ కోర్టుల ఏర్పాటుకు గత ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న క్రమంలో.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్ర, కోస్గి, మక్తల్‌లలో కోర్టుల ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నట్లు గుర్తించి 2022లో ఆమోదం తెలిపారు. దీంతో అధికారులు, నాయకులు కలిసి స్థానికంగా ఉన్న పాత ఎంపీడీఓ కార్యాలయ భవనంను ప్రతిపాదించారు. అధికారుల సమాచారంతో మే 23, 2022న అప్పటి జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ న్యాయమూర్తి ప్రేమావతి, ఎస్పీ వెంకటేశ్వర్లుతో పాటు న్యాయమూర్తులు, న్యాయవాదులు అందరూ కలిసి ప్రతిపాదిత భవనాన్ని పరిశీలించి కోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు నివేదిక పంపించారు. రోజుల వ్యవధిలోనే వడివడిగా అడుగులు పడటంతో కోర్టు కల సాకారం కాబోతుందని అందరు భావించారు. కానీ ఆ పనులు అక్కడితోనే నిలిచాయి. అలాగే మక్తల్‌లో కూడా వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన కోర్టు ఏర్పాటు పనుల గురించి కొన్ని రోజుల క్రితం అక్కడి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించారు. అన్ని విధమైన అనుమతులు తీసుకువచ్చి కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తుండటంతో.. దేవరకద్ర నియోజకవర్గ ప్రజలకు సైతం ఆశలు చిగురిస్తున్నాయి. స్వతహాగా న్యాయవాది అయిన స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ముఖ్యమంత్రితో చర్చించి కోర్టు ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కోర్టు ఏర్పాటు భవనంను పరిశీలిస్తున్న న్యాయమూర్తి, అధికారులు (ఫైల్)

5 మండలాల ప్రజలకు ఇబ్బందులు..

నియోజకవర్గం ఏర్పాటుకు ముందు కేసుల కోసం కక్షిదారులు ఆత్మకూర్, గద్వాల్‌లోని కోర్టుకు వెళ్లేవారు. కానీ గద్వాల్ వెళ్లాలంటే 65–70, ఆత్మకూర్‌కు 35–40 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. నియోజకవర్గం ఏర్పడిన తరువాత క్రమ క్రమంగా అక్కడి కేసులు అన్ని మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని కోర్టులకు బదిలీ చేశారు. ప్రసుత్తం నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాడిన కౌకుంట్ల మండలంతో కలిపి 8 మండలాలు ఉన్నాయి. అందులో కొత్తకోట, మదనాపూర్ మండలాలు వనపర్తి, ఆత్మకూర్ కోర్టుకు వెళ్తుండగా దేవరకద్ర, చిన్న చింతకుంట, అడ్డాకుల, మూసాపేట, కౌకుంట్ల మండలాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. ఈ 5 మండలాల ప్రజలకు సంబంధించి 2500 నుంచి 3000 వరకు సివిల్, క్రిమినల్ కేసులు ఉంటాయని అధికారులు చెప్తున్నారు. వీటి కోసం కక్షిదారులు కోర్టుకు వెళ్లాలంటే 30 నుంచి 40 కిలోమీటర్ల ప్రయాణం చేసే అవసరం ఉంటుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా స్థానికంగా కోర్టును ఏర్పాటు చేయాలని అంటున్నారు.

త్వరలోనే సాకారం అవుతుంది



దేవరకద్ర నియోజకవర్గ ప్రాంత ప్రజల ఇబ్బందిని గుర్తించి, నిలిచిపోయిన మున్సిఫ్ కోర్టు ఏర్పాటు గురించి ముఖ్యమంత్రితో పాటు సంబధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే మున్సిఫ్ కోర్టును ప్రతిపాదిత భవనంలోనే ఏర్పాటు చేస్తాం. మరికొద్ది రోజుల్లోనే దేవరకద్ర ప్రజల కలను సాకారం చేస్తాం.

– మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్యే

ఇబ్బందులు తొలుగుతాయి



దేవరకద్రకు మంజూరు అయిన మున్సిఫ్ కోర్టు ఏర్పాటు జరిగితే కక్షిదారులకు ఇబ్బందులు తొలుగుతాయి. 5 మండలాల పరిధిలోని ప్రజలకు స్థానికంగా కోర్టు లేకపోవడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయి. న్యాయం కోసం సామాన్యులు ఎన్నో వ్యయ ప్రయాసలు పడుతూ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. త్వరగా ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– వెంకటరత్నం, న్యాయవాది